క్లుప్తంగా

ఈ-పంట నమోదు పరిశీలన

ఉరవకొండ: మండల పరిధిలోని రేణుమాకుపల్లి వద్ద ఈ-పంట నమోదును బుధవారం ఉరవకొండ వ్యవసాయశాఖ డివిజన్ ఏడీ పద్మజ, ఏఓ శుభకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో ఆర్‌బీకే సిబ్బంది ఈ-పంట నమోదును పకడ్బందీగా చేపట్టాలన్నారు. రైతులు ఏ పంట అయితే సాగు చేస్తున్నారో ఆ పంటకు సంబంధించిన వివరాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పప్పుశనగ పంట సాగు చేస్తున్న రైతులు తగు జాగ్రత్తలు పాటిస్తూ పంటను కాపాడుకోవాలన్నారు. అనంతరం బూదగవిలో జరుగుతున్న ఈ-పంట నమోదును పరిశీలించారు.

పరామర్శ



కొత్త శ్రీనివాసులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: ఆప్కో మాజీ డైరెక్టర్, చేనేత బ్లాక్ లెవెల్ క్లస్టర్ చైర్మన్ కొత్త శ్రీనివాసులు (53) కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొత్తశ్రీనివాసులు మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం కొత్తశ్రీనివాసులు భార్య కొత్తలక్ష్మిదేవి, కుమారుడు కొత్తశరత్‌ను ఓదార్చారు. కార్యక్రమంలో నాయకులు వై.మధుసూధన్ రెడ్డి, టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు, దేవాంగ సంక్షేమ సంఘం నేతలు పాల్గొన్నారు. పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పెనగొండ్ల కృష్ణమూర్తి (47) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆసుపత్రికి చేరుకుని కృష్ణమూర్తి మృతదేహానికి నివాళులర్పించారు. అలాగే రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ జోగి వెంకటేష్ తల్లి లక్ష్మమ్మ ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

కంబదూరు: స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో నివాసం ఉండే పూల మాదేవి(34) అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల నగదును సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. మిగిలిన సొమ్ము వ్యక్తిగత ఖాతాలోకి జమవుతుందని వారు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామస్వామి, శీనప్ప, వెల్ఫేర్ అసిస్టెంట్ శాంతి తదితరులు ఉన్నారు.

లీకేజీ నీరు మళ్లింపునకు చర్యలు



జల్లిపల్లి వద్ద జేసీబీతో పనులు చేయిస్తున్న పోలీసులు

కూడేరు: మండల పరిధిలోని జల్లిపల్లి వద్ద అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఎస్‌ఐ సత్యనారాయణ బుధవారం చర్యలు చేపట్టారు. రహదారి పక్కన తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి నీరు రహదారిపైకి చేరుతుండటంతో ఇటీవల అక్కడ మూడు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఎస్‌ఐ సత్యనారాయణ జేసీబీతో లీకేజీ నీరు రహదారిపైకి రాకుండా మళ్లింపు పనులు చేయించారు. మలుపులు, రోడ్లపై నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వాహనదారులు నెమ్మదిగా వెళ్లి సురక్షితంగా గమ్యాన్ని చేరాలన్నారు.

వైభవంగా అయోధ్య అక్షింతల శోభాయాత్ర



కలశాలు మోస్తున్న విప్ కాపు దంపతులు

రాయదుర్గంటౌన్: పట్టణంలో బుధవారం శ్రీరామ జన్మభూమి అయోధ్య ట్రస్ట్ నుంచి అక్షింతలతో వచ్చిన కలశాలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. కోట్టు వద్ద గల జమ్మి చెట్టు వద్ద నుంచి లక్ష్మీబజార్, పాతబస్టాండ్, వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు మీదుగా ఆంజనేయస్వామి ఆలయం వరకు శోభాయాత్ర జరిపారు. కలశాలను ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సతీమణి కాపు భారతి, వీహెచ్‌పీ ప్రతినిధులు మోశారు. శోభాయాత్రలో చిన్నారుల సీతారామలక్ష్మణుల వేషధారణ ఆకట్టుకుంది.

ఆడండి.. ప్రతిభ చాటండి

- జోరుగా 'ఆడుదాం ఆంధ్ర' రిజిస్ట్రేషన్లు
- 15 నుంచి జనవరి 26 వరకూ ఆటల పోటీలు

పోటీలు జరిగే తేదీలు..

గ్రామ , వార్డు సచివాయ స్థాయిలో: ఈ నెల 15 నుంచి 20
మండల స్థాయి: ఈ నెల 21 నుంచి జనవరి 4
నియోజకవర్గ స్థాయి: జనవరి 5 నుంచి 10
జిల్లా స్థాయి : జనవరి 11 నుంచి 21
రాష్ట్ర స్థాయి : జనవరి 22 నుంచి 26



బొమ్మనహాళ్: సరైన ప్రోత్సాహం లేక..ప్రతిభను గుర్తించకపోవడంతో ఎంతో మంది క్రీడాకారులు మరుగున పడిపోతున్నారు. ఈ క్రమంలో రాష్ట్రాన్ని క్రీడల్లో అగ్రస్థానంలో ఉంచాలని, క్రీడాకారులను ప్రపంచానికి పరిచయం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో క్రీడా పోటీలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే క్రీడల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించింది. 15 ఏళ్లు పైబడిన బాలబాలికలు పోటీల్లో పాల్గొనవచ్చని, విజేతలకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తామని ప్రకటించింది.

ప్రత్యేక ఏర్పాట్లు..

రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ నెల 13 వరకూ అవకాశం కల్పించారు. క్రీడాకారులు గ్రామ, వార్డు సచివాయాల్లో కానీ, వలంటీర్ ద్వారా కానీ లేదా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక యాప్ కూడా రూపొందించారు. సింగిల్‌గా లేదా గ్రూపుగానైనా రిజిస్టర్ చేసుకునే అవకాశం ఉంది.

ఐదు రకాల క్రీడలు

5 రకాల క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయి. వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్‌తో పాటు సంప్రదాయ యోగా, టెన్నీకాయిట్, మారథాన్ పోటీలు నిర్వహిస్తారు. గ్రామ, వార్డు సచివాలయం, మండలం, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలుంటాయి.

అన్ని ఏర్పాట్లు చేశాం



'ఆడుదాం-ఆంధ్ర' పోటీలకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఏ మైదానంలో ఏ ఆటల పోటీలను నిర్వహించాలో కూడా మ్యాప్ చేసి ఉంచాం. క్రీడాకారులు వలంటీర్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. గ్రామ, వార్డు సచివాయాల్లోనూ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.
– షకీలాబేగం, ఎంపీడీఓ, బొమ్మనహాళ్ మండలం

దరఖాస్తు చేస్తున్న క్రీడాకారుల సంఖ్య

నియోజకవర్గం	వాలీబాల్		క్రికెట్		ఖోఖో		కబడ్డీ		బ్యాడ్మింటన్	
	బాలురు	బాలికలు	బాలురు	బాలికలు	బాలురు	బాలికలు	బాలురు	బాలికలు	బాలురు	బాలికలు
రాయదుర్గం	1,574	381	6,931	675	653	882	2,394	777	598	333
ఉరవకొండ	1,297	431	5,088	473	736	872	1877	540	590	387

ప్రోత్సాహక బహుమతులు ఇలా..

స్థానం	నియోజకవర్గం	జిల్లా	రాష్ట్ర
ప్రథమ	రూ.20 వేలు	రూ.లక్ష	రూ.5లక్షలు
ద్వితీయ	రూ.10 వేలు	రూ.50వేలు	రూ.3లక్షలు

వలంటీర్లు సంక్షేమ వారధులు



మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



హాజరైన నాయకులు, వలంటీర్లు

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: వలంటీర్లు ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో సంక్షేమ వారధులుగా పని చేస్తున్నారని స్త్రీ, శిశుసంక్షేమ శాఖా మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం కళ్యాణదుర్గం మున్సిపాలిటీ, కంబదూరు, బ్రహ్మసముద్రం మండలాల వలంటీర్లు, ముఖ్య నాయకులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ బసవరాజు, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, కంబదూరు వైస్ ఎంపీపీ భీమేష్, అమర్‌లతో కలిసి మంత్రి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఏ ప్రభుత్వం అందించని సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ అందిస్తోందన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని తెలియజేయాలన్నారు. అర్హత ఉండి ఎవరైనా పథకాలు అందకపోతే సరైన ధ్రువీకరణ పత్రాలతో నేరుగా సచివాలయంలో సంప్రదించాలని మంత్రి సూచించారు. భవిష్యత్తులో మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని బలపరచడానికి మనమందరం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా మండలాల వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలపై నివేదిక



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ కరుణ కుమారి

రాయదుర్గం రూరల్: నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలను పరిశీలించి నివేదిక సిద్ధం చేయాలని ఈఆర్‌ఓ (అన్‌సెట్ సీఈఓ) కరుణకుమారి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె బుధవారం అఖిలపక్ష పార్టీ నాయకులు, సెక్టోరియల్ అధికారులు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్‌కు ప్రహరీ ఉందా, విద్యుత్, ఫ్యాన్లు, బల్బుల సౌకర్యం ఉందా లేదా ఫొటోలను తీసుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై రిపోర్ట్ తయారు చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు తహసీల్దార్లు, మండల ప్రత్యేకాధికారులు, ఆర్‌ఐ, వీఆర్‌ఓలు, ఈడీటీ తదితరులు హాజరయ్యారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



సమస్యలను విన్నవిస్తున్న పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు

ఉరవకొండ: నియోజకవర్గంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజినీర్ గాయత్రిని పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు కోరారు. ఉరవకొండ మండలంలోని పెన్నహోబిలం, కౌకుంట్ల, రాకెట్ల తండా గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజినీర్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజినీర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఉరవకొండలో తాగునీటి సమస్య తీర్చేందుకు ఉదిరిపికొండ నుంచి ఉరవకొండకు ప్రత్యేక పైప్‌లైన్ మంజూరైనట్లు తెలిపారు. టెండర్లు కూడా పూర్తి కాగా.. సదరు కాంట్రాక్టర్ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. రీ టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నింబగల్లు ఎస్ఎస్ ట్యాంకు నుంచి ఉరవకొండకు నిర్మించనున్న అదనపు పైప్‌లైన్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. పట్టణంలో జేజేఎం పనులు నత్తనడకన సాగుతున్నాయని వాటిని వేగవంతం చేయాలన్నారు. ఉరవకొండ పట్టణానికి సరఫరా అవుతున్న శ్రీరామిరెడ్డి పథకం తాగునీరు పూర్తిస్థాయిలో సరఫరా కావడం లేదని సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం చీఫ్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ హేసాన్‌బాషా, ఈఈ జవహర్, డీఈ అంజుమన్‌సఫ్రీన్, జేఈ ఫాతీమా, మెయిన్‌టెనెన్స్ కాంట్రాక్టర్ మహానందరెడ్డి పాల్గొన్నారు.

యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్‌గా ప్రణయ్‌రెడ్డి



వై.ప్రణయ్‌రెడ్డి



ఆమిద్యాల రాజేష్

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ అధినేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ అనుబంధ యువజన విభాగానికి రాష్ట్ర కమిటీలను నియమించారు. ఇందులో రాయలసీమ (అనంతపురం, సత్యసాయి, వైఎస్సార్) జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్‌గా యువనేత వై.ప్రణయ్‌రెడ్డిని మరోసారి నియమించారు. అలాగే ఆమిద్యాల గ్రామానికి చెందిన బిరిదేపల్లి రాజేష్‌ను కమిటీ జాయింట్ సెక్రటరీగా నియమించారు. తమపై నమ్మకం ఉంచి పదవిని కట్టబెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వై.ప్రణయ్‌రెడ్డి, ఆమిద్యాల రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

కుందుర్పి: స్థానిక రెవెన్యూ కార్యాలయం ముందు అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు అచ్యుత్‌ప్రసాద్, యూనియన్ లీడర్లు కరియమ్మ, భాగ్యమ్మ తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం అందజేశారు.

కళ్యాణదుర్గం రూరల్: తమ సమస్యలు తీర్చాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం అంగనవాడీ కార్యకర్తలు, ఆయాలు ఆందోళన చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ వారికి మద్దతు ప్రకటించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పాతక్క ఉన్నారు.

రాయదుర్గంటౌన్: అంగన్‌వాడీ వర్కర్ల సమ్మెపై స్పందించి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. రాయదుర్గం పట్టణంలో సమ్మెకు హాజరై ఆయన సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, సీపీఎం నాయకులు నాగరాజు, మధు, అంజి, తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: అంగన్వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి విరూపాక్షి కోరారు. మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం కొనసాగింది. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మునెమ్మ, మహేశ్వరి, నాగవేణి, నాగమణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ ఏర్పాటు హర్షణీయం

బ్రహ్మసముద్రం: పిల్లలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ చేయడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం కళ్యాణదుర్గంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖమంత్రి ఉషశ్రీచరణ్‌కు నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటు కావడంతో తమ గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, నాయకులు హనుమంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశులు, ఉపాధ్యాయులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండో రోజూ తపాలా ఉద్యోగుల సమ్మె

కంబదూరు: స్థానిక హెడ్ పోస్టాఫీస్ వద్ద బుధవారం తపాలా ఉద్యోగులు రెండో రోజూ సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ 7వ వేతన కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకుండా ఉద్యోగులకు మొండిచేయి చూపిందని ఆరోపించారు. ఉద్యోగులు శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, మల్లేశయ్య, వజీర్‌బాషా, గంగాధర్, దేవరాజు, అనిత, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: సమస్యల పరిష్కారం కోరుతూ పోస్టల్ ఉద్యోగుల సమ్మె రెండోరోజు బుధవారం కూడా కొనసాగింది. పట్టణంలోని ఓబుళాచారీ రోడ్డులోని ప్రధాన పోస్టాఫీసు వద్ద శిబిరంలో డివిజన్ పరిధిలోని జీడీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు. 8 డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వజ్రకరూరు: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తపాలా ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పోస్టాఫీసు వద్ద ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్‌సేవక్స్ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు నెట్టికంటయ్య, వెంకటేశ్వర్లు, రామచంద్రప్ప, లోకనాథ్, హిరణ్యరావు, ఎర్రిస్వామి, రమేష్ బాబు, గోవిందు, జ్యోతి, పుష్పాంజలి, ఆనంద్ కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య భద్రతకు పెద్దపీట



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గంటౌన్: పేద ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. అనారోగ్యంతో బెంగళూరు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని సీఎంఆర్‌ఎఫ్ కింద దరఖాస్తు చేసుకున్న 5వ వార్డుకు చెందిన రేకులకుంట వరలక్ష్మీకి రూ.1.50 చెక్కును బుధవారం వారి ఇంటికి వెళ్లి ప్రభుత్వ విప్ అందజేశారు. పేదలకు విద్య, వైద్యం అందజేసేందుకు సీఎం వైఎస్ జగన్ ఎంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ కింద లక్షలాది రూపాయలతో ఉచితంగా పేదలకు వైద్యం అందుతోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస యాదవ్, వలిబాషా, పార్టీ పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి మాధవ రెడ్డి, కౌన్సిలర్లు డిష్ గోవిందు, పెద్ద వన్నూరు స్వామి, శ్రీనివాసరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు నజీర్, వార్డు ఇన్‌చార్జ్‌లు నిజాముద్దీన్, గంగాధర్, మొహమ్మద్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

బొమ్మనహాళ్: మండలంలోని బొల్లనగుడ్డంలో నూతనంగా నిర్మిస్తున్న ఈశ్వర దేవాలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి రూ.1,01,016ను ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. విప్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తన వంతుగా సహాయాన్ని అందించడం సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గాదిలింగ, వైఎస్సార్‌సీపీ నాయకులు బసవరాజు, ఈశ్వరగౌడ్, తిమ్మప్ప, ఆలయ కమిటీ సభ్యులు శంకరయ్య, శివప్ప, మల్లి, తిప్పేరుద్ర, వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి వేడుకలు

ఉరవకొండ: సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి, కల్యాణోత్సవ వేడుకలు ఈనెల 15 నుంచి 19 వరకూ జరుగుతాయని ఆలయ ఈఓ అంగడాల కృష్ణయ్య, ఆలయ చైర్మన్ ఎంసీ కరిబసి, ప్రధాన అర్చకుడు దివాకరశర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 15న స్వామికి ఐదు రకాల పండ్లు, 11 కేజీల తేనెతో అభిషేకాలు, 16న అష్టోత్తర 108 పచ్చి టెంకాయలతో అభిషేకం, 17న 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకం, 18న షష్టి, కల్యాణోత్సవం, 19న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.యన్నారు.

ఆంజనేయా పాహిమాం

గుమ్మఘట్ట: మండలంలోని జె.వెంకటంపల్లిలో వెలసిన ఆంజనేయస్వామిని బుధవారం ముత్యాలపల్లకిలో ఊరేగించారు. రథం ముందు మహిళలు కలశాలను పట్టగా యువకులు నందికోళ్లతో ఉత్సాహంగా నృత్యం చేశారు. గ్రామప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి దర్శనం చేసుకున్నారు. గ్రామంలో భారీగా అంగళ్లు వెలిశాయి.

రేపు సంగమేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

కూడేరు: స్థానిక స్వయంభు శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఈనెల 15న ఉంటుందని ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.బాబు బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత ప్రారంభమయ్యే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి హాజరవుతారన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ శ్రీనివాసులు

కణేకల్లు: మండల ఎస్‌ఐగా ఆర్.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ఎస్‌ఐకి ఏఎస్‌ఐ శంకర్‌రెడ్డి, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

'ఆడుదాం ఆంధ్రా' ఏర్పాట్లపై సమీక్ష

కుందుర్పి: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఏర్పాట్లపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పీఈటీలు, సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో రిజిస్టర్ చేయించుకున్న విద్యార్థుల జాబితాలను సిద్ధం చేయాలన్నారు. అనంతరం కుందుర్పి, మలయనూరు ఉన్నత పాఠశాల ఆటస్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో పీఈటీలు రమేష్, నరేంద్ర, అప్సర్, పంచాయతీ కార్యదర్శులు రామాంజినేయులు, నవీన్, ఓబుళపతి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

రాయదుర్గం రూరల్: కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేయగా, ఒకరు పరారైనట్లు అర్బన్ సీఐ లక్ష్మణ్ణ తెలిపారు. గొల్లపల్లి రోడ్డులో బుధవారం తనిఖీలు చేస్తుండగా వారిని గమనించినట్లు తెలిపారు. పరారవుతుండగా వెంటాడి పట్టుకున్నామన్నారు. 960 టెట్రాప్యాకెట్ల మద్యం పట్టుబడిందన్నారు. నిందితులు పట్టణంలోని రాజీవ్ గాంధీ కాలనీకి చెందిన మాదిగ తిప్పేస్వామి కుమారుడు సోమశేఖర్, కోటలోని మారెమ్మ గుడి ఏరియాకు చెందిన నాయకుల వంశీగా గుర్తించామన్నారు. రాజీవ్ గాంధీ కాలనీకి చెందిన గఫూర్ పరారైనట్లు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

రాయదుర్గంటౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి, గేట్‌మీటింగ్‌తో నిరసన తెలియజేశారు. రాష్ట్ర కమిటీ 59 సమస్యలతో రెండు రోజులు నిరసన కార్యక్రమం చేపట్టాలని సూచించిందని, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

ఉరవకొండ: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, యువనేత ప్రణయ్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు స్వామికి పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఉప సర్పంచ్ వన్నప్ప ఆధ్వర్యంలో జరిగిన పడిపూజలో వందలాది మంది అయ్యప్ప మాలాధారులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం అందించారు.

బదిలీ అయిన ఎస్‌ఐకు సన్మానం

బొమ్మనహాళ్: స్థానిక పోలీసు స్టేషన్ నుంచి బదిలీ అయిన ఎస్‌ఐ శివకు వీడ్కోలు సన్మానం బుధవారం రాత్రి ఏర్పాటు చేశారు. రూరల్ సీఐ యుగేంధర్, ఎస్‌ఐలు రంగడు, సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులు శాలువాతో సన్మానించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వన్నల్లి రామాంజినేయులు, మాజీ కన్వీనర్ ఈశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు లోకేష్, పరమేశ్వర, సత్యన్న, మనోహర్‌శెట్టి, ఆనంద్‌రెడ్డి, కృష్ణ, యోగేశ్వరెడ్డి, వీరన్నగౌడ్, విశ్వనాథ్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, రామకృష్ణ, గాదిలింగ తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

గుమ్మఘట్ట: పూలకుంట, రంగసముద్రం గ్రామాల్లో బుధవారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ శంకర్, ఈఓఆర్డీ సురేశ్‌బాబు, ఏపీజీబీ మేనేజర్ నరసింహయ్య, అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

కళ్యాణదుర్గం రూరల్: ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్టును వెంటనే రద్దు చేయాలని కోరుతూ బుధవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దేవేంద్ర ఆధ్వర్యంలో ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ సెక్రటరీ బంగి రవి, సీనియర్ న్యాయవాదులు ఉన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలు ప్రారంభం

వజ్రకరూరు: కమలపాడు గ్రామంలో బుధవారం సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రత్యేక చొరవతో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. సర్పంచు కురుబ తిరకమ్మ, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, సచివాలయ కన్వీనర్ మనోహర్ పనులను పర్యవేక్షించారు.